
పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలి

- పని గంటలు పెంచుకొని ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలి
- సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు
- సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి సత్తా చాటాలి
- మణుగూరులో కార్మికులతో సింగరేణి సీఎండీ బలరామ్

6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
మంగళవారం, 8 ఏప్రిల్ 2025




రాజదండం


కిరీటం


ఖడ్గం


పాదుకలు


పట్టాభిషిక్తుడైన రామయ్య


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి తుమ్మల


రామాలయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి తుమ్మల

శ్రీరామ.. సార్వభౌమ

కల్యాణ రాముడికి మహాపట్టాభిషేకం

- భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రాజలాంఛనాల సమర్పణ
- రామచంద్రుడికి అష్టోత్తర శతనామార్చన
- పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి తుమ్మల

భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ రాముడికి సోమవారం అత్యంత వైభవంగా మహాపట్టాభిషేకం నిర్వహించారు. శాస్త్రోక్తంగా సాగిన మహాపట్టాభిషేకంలో భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణ సార్వభౌముడికి రాజలాంఛనాలు సమర్పించారు. భద్రాద్రి శ్రీసీతా రామచంద్రస్వామికి ఆదివారం కనుల పండువగా కల్యాణం నిర్వహించగా కల్యాణం జరిగిన మరుసటి రోజైన సోమవారం ఎంతో వైభవంగా శ్రీరామ మహా పట్టాభిషేకోత్సవం నిర్వహించారు. రాజ లాంఛనాలతో సాగిన రామయ్య మహాపట్టాభిషేకం ఘట్టాన్ని భక్త జనం తిలకించి పులకించింది. కిరీటధారణతో పట్టాభిషేక ఘట్టం ముగిసిన తరువాత సముద్ర, నదీ జలాలతో ప్రోక్షణ నిర్వహించారు. వేద పండితుల వేద పారాయణం, వైదిక సిబ్బంది అలనాటి రాముడి పట్టాభిషేక ఘట్టాన్ని మరోసారి (మిగతా 6వ పేజీలో)


పట్టాభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

దేశం సుసంపన్నంగా ఉండాలని రామయ్యను వేడుకున్నా..

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలు, దేశం పాడి పంటలతో సుసంపన్నంగా ఉండాలని భద్రాద్రి రామయ్యను వేడుకున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాచలంలోని మిథిల స్టేడియంలో సోమవారం రామయ్య పట్టాభిషేక మహోత్సవాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు విలేకరులతో ముచ్చటించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం లోకకల్యాణం కోసం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించామన్నారు. రామయ్య మహాపట్టాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రత్యక్షంగా తిలకించారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు పాడిపంటలతో తులతూగాలని ఆ రామయ్యను కోరుకున్నానని, అలాగే దేశం సైతం సుసంపన్నంగా ఉండాలని వేడుకున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

ఇంకా టికెట్లు మిగిలాయి

- నవమికి స్వల్పంగా.. పట్టాభిషేకానికి 50 శాతంపైనే!
- పూర్తిగా అమ్ముడైన ఉభయదాతల టికెట్లు

7

ఆధ్యాత్మికత, ఆదివాసీ.. వారసత్వానికి గుర్తింపు

- రఘురాముడి పట్టాభిషేకానికి హాజరైన గవర్నర్
- భద్రాచలంలో 3.40 గంటలు గడిపిన జిష్ణుదేవ్ వర్మ
- రామయ్యకు పట్టు వస్త్రాల సమర్పణ
- గిరిజన మ్యూజియం ప్రారంభం

7

వశిష్ట స్థానంలో 'పొడిచేటి'

- రామచంద్రాచార్యులుకు దక్కిన గౌరవం

7

ఆర్టీసీకి ఆదాయం రూ. 53లక్షలు

- నవమి రెండు రోజుల్లో భారీగా వచ్చిన జనం
- రవాణా శాఖ ఖజానా గలగల

ఇరు జిల్లాల్లో పలుచోట్ల గాలివాన

- సత్తుపల్లి ప్రాంతంలో నేలరాలిన మామిడి కాయలు
- ధాన్యం కల్లాలపై నిలిచిన నీరు

ఖమ్మం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మధ్యాహ్నం ఉక్కపోతతో జనం సతమతమవగా.. సాయంత్రం వేళల్లో చల్లనిగాలులు వీచడంతో ఉపశమనం పొందారు.ఈ క్రమంలో రాత్రి వేళ ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఈదురుగాలులతో వర్షం కురిసింది. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలంలోని అంకంపాలెంలో 3.4సెంమీ వర్షపాతం నమోదవగా నాయుడుపేటలో 2.2సెంమీ, నాగుపల్లిలో 1సెంమీ, ఖమ్మం జిల్లా వైరాలో 1.18 సెంమీ, సత్తుపల్లి మండలం గంగారంలో 1.08సెం.మీ వర్షపాతం నమోదైంది. ఎర్రుపాలెంలో చిరుజల్లులు కురిశాయి. సత్తుపల్లి, వేంసూరు తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులు, వడగళ్ల వాన కురవడంతో మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిచింది.

ట్రైబల్ మ్యూజియం బాగుంది

- భద్రాచలంలో మ్యూజియాన్ని ప్రారంభించిన గవర్నర్
- జిష్ణుదేవ్ వర్మకు గిరిజన సంప్రదాయంతో స్వాగతం
- గవర్నర్‌కు గిరిజనుల సంస్కృతిని వివరించిన మంత్రి తుమ్మల


గిరిజన మ్యూజియంలో విల్లు ఎక్కుపెట్టిన గవర్నర్, మంత్రి

భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో గిరిజన మ్యూజియాన్ని సోమవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించారు భద్రాచలంలో శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవానికి హాజరైన గవర్నర్ ఈ కార్యక్రమం అనంతరం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో రూ.50 లక్షలతో నూతనంగా ఆధునీకరించిన ట్రైబల్ మ్యూజియాన్ని ప్రారంభించారు. పట్టాభిషేక కార్యక్రమాన్ని ముగించుకొని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మ్యూజియానికి వెళ్లారు. కొత్తగా ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని చూసిన గవర్నర్ ట్రైబల్ మ్యూజియం బాగుందని కితాబిచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు గిరిజన సంప్రదాయ నృత్యంతో స్వాగతం పలికారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ మ్యూజియం ఏర్పాటైందని ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో పాటు అధికారులను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన మహిళలు తయారు చేసిన వంటకాలను కూడా గవర్నర్ పరిశీలించారు. మరోసారి భద్రాచలం వచ్చినప్పుడు గిరిజన మహిళలు చేసిన వంటకాలను తింటానని గవర్నర్ తెలిపారు. గిరిజన మహిళలతో కలిసి గవర్నర్ ఫొటోలు కూడా దిగారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గిరిజన సంప్రదాయ విశేషాలను, గిరిజనుల పరిస్థితులు, జీవన విధానం వారి సంస్కృతి సంప్రదాయాలను గవర్నర్‌కు వివరించారు. మ్యూజియం ప్రారంభ కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం తనిఖీ ఎఫెక్ట్..

- ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

వైరా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలను ఆదివారం రాత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకస్మిక తనిఖీ ఫలితంగా ముగ్గురు అధికారులకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోహిణి, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లుకు డీఈవో సోమశేఖరశర్మ షోకాజ్ నోటీసులు జారీచేశారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు చికెన్, మటన్ పెట్టించని కారణంగా ప్రిన్సిపాల్ రమకు, ఆదివారం విధులకు గైర్హాజరైన అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోహిణికి, పర్యవేక్షణ చేయలేదనే కారణంతో ఎంఈవో వెంకటేశ్వర్లుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సోమవారం అదనపు కలెక్టర్ శ్రీజ హుటాహుటిన పాఠశాలను సందర్శించి తనిఖీ చేశారు.


వరదలకు కొట్టుకుపోయిన పెదవాగు ప్రాజెక్టు (ఫైల్)

పెదవాగు మరమ్మతులకు పచ్చజెండా

- జీఆర్ఎంబీ సమావేశంలో ఇరు రాష్ట్రాల అంగీకారం
- మంత్రి తుమ్మల చొరవతో తీరనున్న రైతుల కష్టాలు

6


నివాళులర్పిస్తున్న పోతినేని, నున్నా

- సుందరయ్య భవన్‌లో సంతాప సభ
- పాల్గొన్న తమ్మినేని, పోతినేని, ఎంపీ వద్దిరాజు, మేయర్ నీరజ

అలుపెరగని కమ్యూనిస్టు నేత యర్రా శ్రీకాంత్

6

రాష్ట్రానికే ఆదర్శంగా
ఖమ్మం మెడికల్ కళాశాల ల్యాబ్
తక్కువ ఖర్చుతో ఏర్పాటుపై మెడికల్ విద్య డైరెక్టర్ ప్రశంస



ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మెడికల్ కళాశాల ల్యాబులు రాష్ట్రంలోని ఇతర మెడికల్ కళాశాలకు ఆదర్శంగా నిలిచాయి. తక్కువ ఖర్చుతో ఆధునికంగా తీర్చిదిద్దిన అధికారులను మెడికల్ విద్య డైరెక్టర్ ప్రశంసించారు. ఈ నేపథ్యంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారుల మన్ననలు కూడా పొందింది. ఖమ్మం మెడికల్ కళాశాల గతేడాది మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. తాత్కాలిక భవనం పాత కలెక్టరేట్‌లో తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లోనూ 100సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి. రెండో ఏడాది విద్యార్థుల కోసం మైక్రోబయాలజీ, పాథాలజీ, పార్మకాలజీ ల్యాబుల్లో ప్రయోగాత్మకంగా పరీక్షలకు సిద్ధం కావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో సర్కారు నుంచి ల్యాబ్ పరికరాలను సరఫరా చేసినప్పటికీ పాత భవనంలో కేవలం రూ.లక్షతో మూడు ల్యాబ్‌లను సిద్ధం చేశారు. వాటర్ పైపులైన్లు, ఔట్‌లెట్లు, ఎలక్ట్రిఫికేషన్ పనులన్నీ లక్షరూపాయాలతో పూర్తి చేశారు. టేబుళ్లు, ట్యాపులు ఇతరత్రా సామగ్రిని టీఎస్‌ఎంఐడీసీ సరఫరా చేయగా వాటిని సిద్ధం చేసి ల్యాబ్‌లను ప్రారంభించారు. ఖమ్మం మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు ల్యాబులను వర్చువల్‌గా పరిశీలించిన వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ మెడికల్ కళాశాల అధికారులను ప్రశంసించారు. అతి తక్కువ ఖర్చుతో సిద్ధం చేసిన ఈ ల్యాబ్‌లను కొత్తగా ఏర్పాటైన 17 కళాశాలలకు ఆదర్శంగా చూపించాలంటూ ఆదేశాలు జారీచేశారు. వీటి తరహాల్లోనే అక్కడి కళాశాలలో ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కూడా ల్యాబ్‌లకు కితాబు నిచ్చినట్లు సమాచారం.

ప్రాణం తీసిన సహజీవనం

- ఖమ్మం నగరంలో మహిళతో ఓ వ్యక్తి సహజీవనం
- ఇద్దరి మధ్య ఘర్షణ
- మహిళ బలంగా నెట్టడంతో తలకి గాయమై వ్యక్తి మృతి
- పోలీసుల అదుపులో సదరు మహిళ



ఖమ్మంక్రైం,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తున్న ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో మహిళ తన సహచరుడిని మంచంపై నుంచి నెట్టడంతో అతడి తల నేలకు బలంగా తాకి తీవ్ర గాయంతో మృతి చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. ఖమ్మం ఖానాపురంహవేలీ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపుడి మండలం, ప్రగడవరం గ్రామానికి చెందిన కొసని రవిప్రసాద్(53) బిల్డర్, కాంట్రాక్టర్‌గా పనిచేస్తుండగా గతంలో అతడు ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఓ అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న సమయంలో ఏలూరు జిల్లా, చింతలపుడి మండలం, రాఘవపురం గ్రామానికి చెందిన మడికంట లావణ్య అనే వివాహితతో పరిచయం ఏర్పడింది. ఆమె అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్‌గా చేస్తానని చెప్పడంతో లావణ్యతో పాటు ఆమె భర్తను కూడా రవిప్రసాద్ పనిలో పెట్టుకున్నాడు. ఆ తరువాత రవిప్రసాద్, లావణ్య మధ్య చనువు పెరిగింది. కొద్ది రోజుల తరువాత లావణ్యకు తన భర్తతో గొడవలు కావడంతో భర్తను కుమారుడుడిని వదిలి కుతురుతో కలిసి సతుపల్లిలో మరోఇంటిని అద్దెకు తీసుకుని ఉంటుంది. అయితే రవిప్రసాద్ ఆమె ఇంటికి పలుమార్లు వెళ్లడంతో రవి సోదరుడు అతడిని హెచ్చరించాడు. దాంతో సత్తుపల్లిలో ఉంటే విషయం కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిసి గొడవలు అవుతున్నాయని రవిప్రసాద్ కూడా తన భార్య, ఇద్దరు పిల్లలను వదిలి లావణ్యతో కలిసి గత అక్టోబర్‌లో ఖమ్మం నగరంలోని నేతాజీనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నారు. కొంతకాలం ఇద్దరు బాగానే ఉన్నా ఆ తరువాత ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఈ గొడవలపై రవిప్రసాద్ స్నేహితుడు వద్ద కూడా పంచాయితీలు జరిగాయి. అయితే ఇద్దరు విడిపోవాలని అందరూ సూచించడంతో నెలరోజుల పాటు ఇద్దరూ విడిగా ఉన్నారు. తరువాత మళ్లీ కలిశారు. ఈ క్రమంలో గత నెలలో రవిప్రసాద్ తండ్రి మృతి చెందడంతో తండ్రి కర్మలు పూర్తి చేసుకుని అతడు శనివారం సాయంత్రం ఖమ్మానికి వచ్చాడు. అయితే ఆదివారం ఉదయం లావణ్య, రవి మధ్య గొడవ జరిగింది. తరువాత ఇద్దరు మాట్లాడుకోలేదు. ఈ క్రమంలో సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రవిప్రసాద్ బాగా మద్యం తాగి రాత్రి ఇంటికి వచ్చాడు. తరువాత ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాత్రి పడుకున్న తరువాత ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవలో రవిప్రసాద్ అమెను కొరకడంతో లావణ్య వెంటనే రవిప్రసాద్ ఒంటిపై ఉన్న బనియన్‌ను మెడకు వేసి లాగి మంచంపై నుంచి నెట్టింది. దీంతో కింద పడ్డ రవిప్రసాద్ తల బలంగా ఫ్లోర్‌కు తగిలి తీవ్రగాయం కావడంతో మృతి చెందాడు. వెంటనే లావణ్య 108కు ఫోన్ చేసింది. తరువాత డయల్100కు కూడా ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. పోలీసులు వచ్చేలోపే 108లో రవిప్రసాద్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశిలించి అతడు మృతి చెందినట్టు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహన్ని మార్చురీలో భద్రపరిచి లావణ్యను అదుపులోకి తీసుకున్నారు. రవిప్రసాద్ కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం ఖమ్మానికి చేరుకున్నారు. తన తండ్రిని లావణ్య ఉరివేసి హత్య చేసిందని మృతుడి కుమారుడు పునిత్‌సాయి ఖమ్మం ఖనాపురంహవేలీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా లావణ్య తన భర్తతో విడాకులు కావాలని పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసింది. అదేవిధంగా జరిగిన ఘర్షణలో రవిప్రసాద్ తనను కూడా గొంతు నులిమాడని పోలీసులకు లావణ్య ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

9న జాబ్ మేళా
జిల్లా ఉపాధి అధికారి మాధవి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగమైన అపోలో ఫార్మసీలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 9న ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ, టేకులపల్లి) ఖమ్మంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి సోమవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, ఖమ్మంలో పని చేసే విధంగా అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ట్రెయినీ ఫార్మాసిస్ట్‌గా పని చేసేందుకు 18-35 సంవత్సరాల వయస్సు గల డీఫార్మసీ/బీఫార్మసీ /ఎం ఫార్మసీ (పీసీఐ) అర్హత కలిగిన వారు, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రెయినీ అసోసియేట్ పోస్టులకు పదో తరగతి అర్హత ఉన్న యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు వేతనం రూ.11 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. 100 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి కలిగిన వారు విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని ఆమె ఓ ప్రకటనలో కోరారు.

బీసీ గురుకులాలకు 15 నుంచి 22 వరకు
ఎస్‌ఏ-2 పరీక్షలు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 28 బీసీ గురుకుల 5-9 విద్యార్థులకు ఈనెల 15నుంచి 22వరకు సమ్మెటీవ్ అసెస్‌మెంట్-2 (ఎస్‌ఏ)పరీక్షలు నిర్వహించనున్నట్లు బీసీ గురుకులాల ఆర్‌సీవో చింతమళ్ల రాంబాబు తెలిపారు.ఈమేరకు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన కులాల వేల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ (ఎంజేపీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) సెక్రటరీ బి.సైదులు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారని అన్నారు. 5-7 తరగతులకు ఉదయం 9- 11.45 వరకు 8-9 తరగతులకు మధ్యాహ్నం 2- 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ గురుకులాలకు ఎంజేపీ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్రశ్నాపత్రాలను తయారు చేసి పరీక్షలు నిర్వహణకు ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీ గురుకుల ఎడ్యుకేషన్ సొసైటీ సూచనల మేరకు 23న పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించి ప్రొగ్రెస్ రిపోర్టును అందజేయాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాల కన్వీనర్లకు ఆర్‌సీవో సూచించారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వరకు వేసవి సెలవులు ఉంటాయని ఆయన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 11 బీసీ గురుకులాలు, 1 డిగ్రీ కళాశాల, ఖమ్మం జిల్లాలోని 16 బీసీ గురుకులాలతో కలిపి మొత్తం 28 బీసీ గురుకులాలు ఉన్నాయి. బీసీ గురుకులాల్లో 5-9 తరగతి చదువుతున్న విద్యార్థులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3850మంది ఖమ్మం జిల్లాలో 4550మందితో కలిపి మొత్తం 8400మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని భద్రాద్రి జిల్లా కన్వీనర్ బ్యూలారాణి, ఖమ్మం జిల్లా కన్వీనర్ సుష్మలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను
తనిఖీ చేసిన ఆర్‌జేడీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

కొణిజర్ల,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొణిజర్లలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి తనిఖీ చేశారు. చిన్నారుల ఎత్తు, బరువు, హాజరు శాతం, చిన్నారులకు అందించే పౌష్టికమైన ఆహారం పరిశీలించారు. ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాల వివరాలను పట్టిక ద్వారా పరిశీలించి చిన్నారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులను కూడా చైతన్యం చేయాలని, 100 శాతం హాజరు ఉండేలా ప్రతి రోజు చూడాలని సూచించారు. మా ఇంటి మణిదీపం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కమలప్రియ, కొణిజర్ల సెక్టార్ సూపర్‌వైజర్ కె.జ్యోతి, పోషణ అభియాన్ డీసీ కొమ్మినేని బాబు, షామిలి, అంగన్‌వాడి టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్స్ అసోసియేషన్
జిల్లా అధ్యక్షుడిగా జక్కంపూడి



జక్కంపూడి కిషోర్

తల్లాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్స్ అసోసియేషన్(బీఏఐ)ఉమ్మడి ఖమ్మంజిల్లా అధ్యక్షుడిగా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన జక్కంపూడి కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కిషోర్ 2011నుంచి కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రముఖ రాజకీయ వేత్త జక్కంపూడి కృష్ణమూర్తి కుమారుడైన కిషోర్‌కు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని కాంట్రాక్టర్స్‌తో సత్సంబంధాలు ఉన్నాయి. దీని దృష్ట్యా కిషోర్ ఉమ్మడి ఖమ్మంజిల్లా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికయ్యేందుకు దోహదపడింది. కిషోర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తదితరులు అభినందించారు.

జీపీవో దరఖాస్తుల స్వీకరణ షురూ



కలెక్టరేట్ ఏవోకి జీపీవో పోస్టుకు దరఖాస్తును అందిస్తున్న పూర్వపు వీఆర్వోలు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జీపీవో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ సోమవారం ప్రారంభమయ్యింది. ఖమ్మం జిల్లాలో గతంలో 313 మంది వీఆర్వోలు విధులు నిర్వహించారు. గత ప్రభుత్వం వీఆర్వోల వ్యవస్థను రద్దుచేసి వారందరినీ వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామానికీ రెవెన్యూ అధికారిని ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు ఇటీవలె జీవోను జారీ చేసింది. ప్రతి గ్రామానికి జీపీవో (గ్రామ పరిపాలన అధికారిగా) నియమించేందుకు ఆప్షన్లను కేటాయించింది. దీంతో ఖమ్మం జిల్లాలో తొలిరోజున పూర్వపు వీఆర్వోలు 117 మంది ఆన్‌లైన్ ద్వారా జీపీవో పోస్టుకు దరఖాస్తు చేశారు. మొత్తం 18 కాలమ్స్‌లో వీటిని నింపారు. వ్యక్తిగత వివరాలు, విద్యార్హతలు, ఎక్స్‌పీరియన్స్ వివరాలు నింపి కలెక్టరేట్ ఏవోకు అందచేస్తున్నారు. దీంతో పూర్వపు వీఆర్వోలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆహార భద్రతా అధికారుల పోస్టులకు
ఆయుష్ కోర్సుల అర్హత
ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం

ఇల్లెందు ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి):ఆహార భద్రత, నాణ్యతప్రమాణాల (ఫుడ్ సెఫ్టీ అండ్ స్టాండర్స్)అధికారుల ఉద్యోగ నియామకాలకు ఆయుష్ కోర్సులు చదివిన అభ్యర్థులు సైతం అర్హులుగా కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. గెజిట్ ఆఫ్ ఇండియా మార్చి 28న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఆహారభద్రత, ప్రమాణాల అధికారుల ఉద్యోగ నియామకాలకు హోమియోపతి, ఆయుర్వేద, యునాని, సిద్ధ ఆయుష్ కోర్సులతోపాటు దంతవైద్య కోర్సులు చదివినఅభ్యర్థులు కూడా అర్హులని ఉత్తర్వులు జారీచేసింది.

శ్రీరామ.. సార్వభౌమ

(5వ పేజీ తరువాయి)

కళ్లకు కట్టినట్లుగా నిర్వహించారు. ఈ మహాపట్టాభిషేక ఘట్టంలో రామయ్యకు ఒక్కొక్కటిగా రాజలాంచనాలను సమర్పించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించగా పుష్యమి నక్షత్ర పర్వదినాన కల్యాణ రాముడికి పట్టాభిషేక ఘట్టాన్ని మిథిలా స్టేడియంలో భక్తజన కోలాహలం నడుమ నిర్వహించారు. నూతన దంపతులైన సీతారామచంద్ర స్వాముల వారిని ఆలయం నుంచి సోమవారం 9.53 గంటలకు మేళతాళాలు, భాజభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల కోలాటాల నడుమ మిథిలా స్టేడియంకు 10.20గంటలకు తీసుకొచ్చారు. శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంపై 10.26 గంటలకు ఆసీనులను చేశారు. అనంతరం పట్టాభిషేక తంతును అర్చకస్వాములు, వేద పండితులు ప్రారంభించారు. తొలుత ఆరాధనతో భద్రాచలంలో పట్టాభిషేక వైభవాన్ని వివరించారు. పట్టాభిషేక మహోత్సవ ఆరంభంలో విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కలశాలకు ఆరాధన నిర్వహించి రాజలాంచనాలతో పట్టాభిషేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎనిమిదిమంది వైదిక మంత్రులు, వశిష్టస్థానంలో భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి రామచంద్రాచార్యులు ఉన్నారు. అనంతరం తారక మంత్రం, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు.

రాజలాంఛనాలతో ఆభరణాల సమర్పణ

అనంతరం శ్రీరామ మహాసామ్రాజ్య ఘట్టంలో ఒక్కొక్కటి స్వామివారికి అలంకరించారు. ముందుగా శ్రీరామ బంగారు పాదుకలను అర్చకస్వాములు భక్తులకు చూపించి సమర్పించారు. ఆ తరువాత రాజనీతిని తెలియజేసే రాజదండం, రాజ ముద్రిక, భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం శ్రీరాముడికి, చింతాకు పతకం సీతమ్మకు, శ్రీరామమాడను లక్ష్మణస్వామికి సమర్పించారు. అనంతరం చామరం, బంగారు చత్రం, దుష్ట శిక్షణ కోసం రాజఖడ్గాన్ని రామయ్యకు అందజేశారు. చివరగా పట్టాభిషేక ముగింపుగా సామ్రాట్ కిరీటాన్ని రామయ్యకు ధరింపజేశారు. ఈ సమయంలో భక్తులు కరతాల ధ్వనులతో రామయ్యకు జేజేలు పలికారు. అనంతరం దేవేంద్రుడు కానుకగా పంపినట్లుగా చెప్పే ముత్యాలహారాన్ని తొలుత రామయ్య మెడలో వేయగా అది రామయ్య నుంచి సీతమ్మకు, సీతమ్మ నుంచి రామ భక్త సామ్రాజ్యానికి అధిపతి అయిన హనుమంతుడికి సమర్పించారు. అనంతరం సమస్త నదీ జలాలు, నాలుగు సముద్రాల నుంచి సేకరించిన నదీ జలాలతో రామయ్యకు ప్రోక్షణ నిర్వహించారు. అనంతరం ఆ జలాలతో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు, భక్తులపై ప్రోక్షణ చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ జిష్ణుదేవ్, మంత్రి తుమ్మల

శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని పురస్కరించుకొని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వీరితో పాటు అహోబిల మఠం, చినజీయర్‌స్వామి తరఫున, కంచి పీఠం తరఫున, భక్తరామదాసు, తూము నరసింహదాసు వారసుల తరఫున పట్టు వస్త్రాలను వారి ప్రతినిధులు అందజేశారు. 2011 పుష్కర పట్టాభిషేకం నుంచి ఈ మహోత్సవానికి గవర్నర్లు హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పట్టాభిషేక మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రామయ్యకు పూజలు నిర్వహించిన గవర్నర్ జిష్ణుదేవ్, మంత్రి తుమ్మల

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్దంగా స్వాగతం పలికారు ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. దేవస్థానం తరఫున గవర్నర్‌కు జ్ఞాపిక, స్వామి వారి ప్రసాదం, శాలువాలను బహూకరించారు. ఈ పట్టాభిషేక కార్యక్రమాన్ని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఆర్డీవో దామోదర్‌రావు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ప్రథమ శ్రేణి న్యాయాధికారి శివనాయక్ తిలకించారు. భద్రాచలం వచ్చిన గవర్నర్‌కు బీపీఎల్ హెలిప్యాడ్ వద్ద వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు స్వాగతం పలికారు.

పెదవాగు మరమ్మతులకు పచ్చజెండా

- జీఆర్‌ఎంబీ సమావేశంలో ఇరు రాష్ట్రాల అంగీకారం
- శాశ్వత మరమ్మతులు చేసేందుకు నిర్ణయం

అశ్వారావుపేట/రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి సమీపంలోని మధ్యతరహా జలాశయం పెదవాగు ప్రాజెక్టుకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఆంధ్రా, తెలంగాణాలో 16వేల ఆయకట్టు కలిగిన పెదవాగు ప్రాజెక్టు శాశ్వత మరమ్మతులకు నిధులు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రాష్ట్రాల చెందిన నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి తుమ్మల వినతిమేరకు సోమవారం హైదరాబాదులో జరిగిన జీఆర్‌ఎంబీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు చర్చించి ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు నిర్ణయించారు. ఆయకట్టు విస్తీర్ణం ఆధారంగా నిధులను భరించి ప్రాజెక్టుకు పునర్వైభవం తీసుకువచ్చేందుకు బోర్డు సమావేశంలో ఆమోదించారు. ఖరీఫ్ నాటికి పంటలు పండించుకునేలా తాత్కాలిక మరమ్మతులు చేయాలని నిర్ణయించారు.

అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో 1980లో మధ్యతరహా జలాశయం పెదవాగును నిర్మించారు. సుమారు 1,200 ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్రంలో 16వేల ఎకరాలకు నీరందించేలా 21అడుగుల నీటిమట్టంతో ప్రాజెక్టును నిర్మించారు. ఆరంభంలో ఆయకట్టు రైతుల సంతోషాలతో వర్ధిల్లిన ప్రాజెక్టు 2014 తెలుగు రాష్ట్రాల విభజన అనంతరం దుర్భరంగా మారింది. ప్రాజెక్టు ఆనకట్ట, 2వేల ఎకరాల సాగు తెలంగాణలో ఉండగా ఆంధ్రాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మరో 14వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో అధికంగా పోలవరం ముంపులో పోయింది. దీంతో గడిచిన పదేళ్లుగా ప్రాజెక్టుకు ఏ రాష్ట్రం కూడా నిధులు ఇవ్వటం లేదు. గడిచిన 10ఏళ్లుగా ప్రాజెక్టు అంతరాష్ట్ర సమస్యగా మారిపోయింది. ఇదే తరుణంలో గత ఏడాది ఊహించని విధంగా వచ్చిన భారీ వర్షానికి పెదవాగు కట్టకు భారీగా గండిపడింది. ప్రాజెక్టుకు గండి పడటంతో వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఆస్తినష్టం సంభవించింది. అప్పట్లో మంత్రి తుమ్మల ప్రాజెక్టును సందర్శించి శాశ్వత మరమ్మతులకు చర్యలు చేపడతానని రైతులకు హామీ ఇచ్చారు. దీనిపై రెండు రాష్ట్రాల అధికారులతోనూ మాట్లాడారు. దీంతో ప్రాజెక్టు మరమ్మతులపై రెండు రాష్ట్రాలకు చెందిన నీటిపారుదలశాఖ అధికారులు ప్రాజెక్టును సందర్శించి స్థితిగతులను పరిశీలన చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలంటే ఏమీ చేయాలనే దానిపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాదులో సోమవారం జరిగిన జీఆర్‌ఎంబీ సమావేశంలో ప్రాజెక్టు పరిస్థితిపై రెండు రాష్ట్రాల నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో పాల్గొన్న ఇరు రాష్ట్రాలకు చెందిన నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో రెండు రోజులు మంత్రి తుమ్మల మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేలా ప్రణాళికలు తయారుచేసుకోవాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో అధికారులు ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు నిర్ణయించుకున్నారు. ఆయకట్టు ఆధారంగా ఆయా రాష్ట్రాలు ఆస్థాయిలో నిధులు మంజూరు చేసేలా ఆమోదం తెలుపుకున్నారు. వచ్చే సీజన్‌లో ప్రాజెక్టు కింద పంటలు వేసేకునేలా తాత్కాలిక మరమ్మతులు చేయాలని కూడా నిర్ణయించారు. ఎట్టకేలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ప్రాజెక్టు అవసరమైన నిధులు మంజూరుకు అవకాశం లభించింది. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మోక్షం లభించనుండటంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలి



మణుగూరు ఓసీ అభినందన సభలో మాట్లాడుతున్న సీఎండీ

మణుగూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న పోటీ మార్కెట్ ప్రపంచాన్ని ఎదుర్కొని సింగరేణిని అభివృద్ధి ప్రధాన నిలపాలంటే పని గంటలు పెంచుకుంటూ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. మణుగూరు ఏరియాలో సోమవారం డైరెక్టర్ ఈఎండ్‌ఎం డి. సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణ, డైరెక్టర్ వీవీకే వెంకటేశ్వర్లు, ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి సీఎండీ బలరామ్ పర్యటించారు.

నూతన సైట్ ఆఫీసు ప్రారంభం

సింగరేణి సీఎండీ తొలుత ఏరియాలోని ప్రకాశంఖని ఓపెన్ కాస్టు-2, ఓసీ-4, కొండాపురం యూజీ మైన్, మణుగూరు ఓసీ గనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియాలోని ఓసీ-2 నూతన సైట్ ఆఫీసును ప్రారంభించారు. గని ప్రాంగణంలో సీఎండీ ఇతర డైరెక్టర్లు మొక్కలను నాటారు. అనంతరం కొండాపురం యూజీ మైన్‌లో రెస్క్యూస్టేషన్‌ను అనంతరం పీకే ఓసీ-4లో ప్రీవెయిట్ ట్రక్‌లోడింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. పీకే ఓసీని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఉత్తమ గని అభినందన సభలో సీఎండీ మాట్లాడుతూ అధికారులు, కార్మికులు, సూపర్‌వైజర్లను ప్రత్యేకంగా అభినందించారు. 2024-25 వార్షిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో ఉత్పాదకతలో రవాణాలో 69 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని కంపెనీ సాధించిందని, అయితే ప్రస్తుతం ప్రైవేటు, కోల్ ఇండియా నుంచి ఎదురవుతున్న పోటీని ఎదుర్కోవాలంటే కొత్త గనుల అనుమతులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొత్త బొగ్గు బ్లాక్‌లను సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరంలో ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు కొత్తగూడెం వీకేగని, ఇల్లెందులోని రోంపేడు ఓసీ, బెల్లంపల్లిలోని గోల్లేటి ఓసీని ప్రారంభించి అధికోత్పత్తి దిశగా అడుగులు వేశామన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పాదనలో సింగరేణి ఇప్పటికే 245.5 మెగావాట్ల విద్యుత్ అందిస్తోందన్నారు. సుమారు 1,000 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

క్యాంటిన్‌లో కార్మికులతో మాటామంతి

మణుగూరు ఓసీ-2 క్యాంటిన్‌లో సీఎండీ కార్మికులతో మాటామంతి నిర్వహించారు. కార్మికులతో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు కార్మికులు యాంత్రాలను సద్వినియోగం చేసుకుంటూ పూర్తి పని గంటలు వాడాలన్నారు. కార్మికసంక్షేమం కోసం యాజమాన్యం చేపడుతున్న చర్యలను వివరించారు. కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏరియాలోని సింగరేణి పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ఏఉంచి సీబీఎస్‌సీ సిలబస్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ఆసుపత్రిలో కార్యక్రమంలో జీఎం ఎంఎస్ సురేష్, జీఎం రెస్క్యూ కే. శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఓటూ డైరెక్టర్ కేవీ రావు, ఏజీఎం ఐఈ కార్పొరేట్ బొజ్జా రవి, ఏజీఎం సివిల్ డీ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

అలుపెరగని కమ్యూనిస్టు నేత
యర్రా శ్రీకాంత్

- సుందరయ్య భవన్‌లో సంతాప సభ
- పాల్గొన్న తమ్మినేని, పోతినేని, ఎంపీ వద్దిరాజు, మేయర్ పునుకొల్లు నీరజ



నివాళులర్పిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సీపీఎం విధానాలే ఊపిరిగా పార్టీ సిద్ధాంతాల కోసం అలుపెరగని నేతగా యర్రా శ్రీకాంత్ పనిచేశారని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధితో అకస్మికంగా మృతి చెందిన యర్రా శ్రీకాంత్ భౌతికకాయన్ని సోమవారం మధురై నుంచి ఖమ్మం సీపీఐ కార్యాలయానికి తరలించారు. ప్రకాశ్‌నగర్ నుంచి బైక్ ర్యాలీతో పార్టీ శ్రేణుల రెడ్ సెల్యూట్ నడుమ సుందరయ్యభవన్‌కు యర్రా శ్రీకాంత్ భౌతిక కాయం తరలించారు. అనంతరం సంతాపసభ నిర్వహించారు. సీపీఎంలో యర్రా శ్రీకాంత్ నిర్వహించిన క్రియాశీలక ఉద్యమాలను నాయకులు వివరించారు. ఆయన మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటుగా నాయకులు అభివర్ణించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ యర్రా శ్రీకాంత్ లేనిలోటు ప్రజాఉద్యమాలపై పడుతుందన్నారు. సీపీఎం పార్టీ ఓ ధృవ తారను కోల్పోయిందన్నారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల అశోక్, సీపీఎం నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, వై. విక్రమ్, బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, భూక్య వీరభద్రం బండి పద్మ నివాళులు అర్పించారు. కాగా యర్రా శ్రీకాంత్ కుమారుడు అమెరికా నుంచి రావాల్సి ఉండటంతో అంత్యక్రియలు బుధవారం ఉదయం జరగనున్నాయి.

గవర్నర్ జిష్ణుదేవ్‌కు ఘనస్వాగతం



» స్వాగతం పలికిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే వెంకట్రావు

బూర్గంపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీరాముని మహా పట్టాభిషేకానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌కు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. సోమవారం హైదారాబాదు నుంచి హెలీకాప్టర్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల బీపీఎల్ స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడు వద్దకు చేరుకున్నారు. గవర్నర్‌కు హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మలతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ఐటీసీ గెస్ట్‌హౌజ్‌కు చేరుకున్న గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొంత సమయం తర్వాత ఐటీసీ గెస్ట్‌హౌజ్ నుంచి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపట్టాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో బూర్గంపాడు మండల పరిధిలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖుషీ..ఖుషీగా మంత్రి తుమ్మల

» కలెక్టర్, ఎస్పీలను అభినందించిన మంత్రి

బూర్గంపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల బీపీఎల్ స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖుషి.. ఖుషిగా కనిపించారు. సోమవారం భద్రాచలం శ్రీరాముని మహపట్టాభిషేకానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌కు స్వాగతం పలికేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, తదితరులు హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో మంత్రి తుమ్మల కలెక్టర్, ఎస్పీ చేతులు పట్టుకుని వారి సేవలను అభినందించారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణంతో పాటు మహపట్టాభిషేకాన్ని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేసినందుకు వారి సేవలను ప్రశంసించినట్లు తెలుస్తోంది. మంత్రి నడుకుంటూ వారిని అభినందిన తీరు చూసిన అక్కడి అధికారులు హర్షం వ్యక్తం చేశారు.



ఆర్టీసీకి ఆదాయం రూ. 53లక్షలు

భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి మహోత్సవాల సమయంలో భద్రాచలం ఆర్టీసీ డిపోకు గత రెండు రోజుల్లో రూ.53 లక్షల ఆదాయం వచ్చినట్లు సమాచారం. 6, 7వ తేదీల్లో శ్రీరామనవమి, శ్రీరామ మహాపట్టాభిషేకాలను పురస్కరించుకొని భద్రాచలం ఆర్టీసీ డిపో భద్రాచలం పర్ణశాల మధ్య 22 బస్సులను నడిపింది. హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో 15 సర్వీసులు నడుపుతుండగా పది సర్వీసులు అదనంగా నడిపినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నారు. విశాఖపట్నానికి రెగ్యులరుగా రెండు బస్సులు నడుపుతుండగా అదనంగా మరో బస్సు, రాజమండ్రికి రెగ్యులరుగా పది బస్సులు నడుపుతుండగా అదనంగా మరో ఐదు, విజయవాడకు రెగ్యులరుగా 11 బస్సులు నడుపుతుండగా అదనంగా మరో నాలుగు బస్సులను నడిపినట్లు ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. భద్రాద్రి ఆర్టీసీ డిపోకు రూ.53 లక్షల ఆదాయం వచ్చి ఉంటుందని అంచనా వేస్తున్నామని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం తెలిసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రాయచూర్ నుంచి భద్రాద్రికి..



భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన బుల్లెమ్మాయి అలియాస్ రమణమ్మ 20 ఏళ్లుగా భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేకంను తిలకిస్తున్నారు. భద్రాచలంలోని జీయర్‌మఠంలో ఉండి ఇక్కడ భద్రాచలం ఉత్సవాలను తిలకించి వెళతారు. కల్యాణానికి రావడంతో ఎంతో సంతృప్తి కలుగుతోందని, ఏటా ఇలా వచ్చి రామున్ని దర్శనం చేసుకోవడం కల్యాణం పట్టాభిషేకం తిలకించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పట్టాభిషేకంను చూస్తూ రామకోటి రాస్తూ రాముడిపై భక్తిని చాటుకుంటానని ఆమె తెలిపారు.

లోక క్షేమం కోసమే పట్టాభిషేకం

» భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యుడు కేఈ స్థలశాయి



భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లోక క్షేమం కోసమే భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని నిర్వహించినట్లు దేవస్థానం స్థానాచార్యుడు కేఈ స్థలశాయి తెలిపారు. సోమవారం మిథిల స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహించగా దాని ప్రాశస్త్యం స్థానాచార్యులు వివరించారు. శ్రీమద్రామాయణపారాయణం 27 రోజులు నిర్వహించిన అనంతరం పుష్యమి నాడు శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించడం సంప్రదాయమన్నారు. ఏటా శ్రీరామనవమి మరుసటి రోజున శ్రీరామ మహా పట్టాభిషేకం నిర్వహించడం జరుగుతుందని, 12 ఏళ్లకోసారి పుష్కర పట్టాభిషేకాన్ని, 24 ఏళ్లకోసారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకాన్ని భద్రాద్రి దేవస్థానంలో నిర్వహిస్తామన్నారు. 60 ఏళ్లకోసారి మహాసామ్రాజ్య పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారని తెలిపారు. 2011లో నిర్వహించిన పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి గవర్నరు ముఖ్య అతిథిగా హాజరయ్యారని నాటి నుంచి ప్రతి శ్రీరామ మహాపట్టాభిషేకానికి గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరవుతుండటం ఆనవాయితీగా వస్తోందని వివరించారు.

'మత సామరస్యాన్ని గౌరవించడం హర్షణీయం'

» జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్



వాటర్ బాటిళ్లు అందజేస్తున్న అహ్మద్

భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి దేశం ప్రతీకగా నిలుస్తోందని, ఒకరి మతాన్ని మరొకరు గౌరవిస్తూ పండుగలను జరుపుకోవడం సంతోషకరమని నేతాజీ యువజన సంఘం, జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ అన్నారు. సోమవారం శ్రీరామ పట్టాభి షేకం సందర్భంగా భద్రాచలం వచ్చిన భక్తులకు అహ్మద్ అధ్వర్యంలో ఓఆర్ఎస్, వాటర్ ప్యాకెట్లు, పండ్లు,బిస్కెట్ అందజేశారు.

దర్గాలో శ్రీరాముడి పట్టాభిషేకం

» సత్యనారాయణపురంలో వెల్లివిరిసిన మతసామరస్యం



దర్గాలో శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం సత్యనారాయణపురంలో శ్రీరామ నవమి సందర్భంగా హిందు, ముస్లింలు ఐక్యతను చాటారు. నవమి సందర్భంగా ఊరంతా కలిసి గ్రామంలో ఉన్న హజరత్ నాగుల్‌మీరా దర్గాలో శ్రీరాముడి కల్యాణాన్ని నిర్వహించారు. దర్గాలో సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీరాముడి పట్టాభిషేకం జరిపి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. హిందు సంప్రదాయ పద్ధతిలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాముడి పట్టాభిషేకం చేశారు మహోత్సావాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇల్లెందు పట్టణం నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆధ్యాత్మికత, ఆదివాసీ.. వారసత్వానికి గుర్తింపు



» రఘురాముడి పట్టాభిషేకానికి హాజరైన గవర్నర్
» భద్రాచలంలో 3.40 గంటలు గడిపిన జిష్ణుదేవ్ వర్మ
» రామయ్యకు పట్టు వస్త్రాల సమర్పణ
» గిరిజన మ్యూజియం ప్రారంభం

భద్రాచలం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3.40గంటల పాటు పర్యటించారు. భద్రాచలంలో కనులపండువగా సాగింది. శ్రీరాముని పట్టాభిషేక వేడుకకు ముఖ్య అతిథిగా హాజరుకావడంతో పాటు ఐటీడీఏ ఆవరణలో నూతనంగా రూ.50లక్షలతో ఆధునికీకరించిన గిరిజన మ్యూజియాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. గిరిజన సంప్రదాయ బాణం విల్లుతో గురిపెట్టి, గిరిజనులు ధరించే కొమ్ము కిరీటంను ధరించారు. హెలీకాప్టర్‌లో ఉదయం 11 గంటలకు ఐటీసీ బీపీఎల్ హెలీప్యాడ్‌కు చేరుకున్న గవర్నర్‌కు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వాగతం పలికారు. అనంతరం బీపీఎల్ విశ్రాంతి గృహానికి వెళ్లి భద్రాచలం ఆలయానికి వెళ్లారు. ఆలయంలో 11.40కి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో గవర్నర్‌కు శాలువ, జ్ఞాపిక అందజేశారు. అనంతరం మంత్రి తుమ్మలతో కలిసి 12 గంటలకు మిథిల స్టేడియంలోని పట్టాభిసేకం జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పట్టాభిషేక తంతును ఆసక్తిగా తిలకించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను రామయ్యకు గవర్నరు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా శ్రీరామునికి పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం వేద పండితులు నదీ జలాలతో అర్చన నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి గవర్నర్ వెళ్లగా అక్కడ గిరిజన సంప్రదాయపద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం ఆధునికీకరించిన మ్యూజియంను గవర్నర్ ప్రారంభించారు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల గిరిజన సంస్కృతి సంప్రదాయాలను వివరించారు. గవర్నర్ విల్లుతో గురిపెట్టారు. గిరిజన సంప్రదాయ కొమ్ము తలపాగాను ధరించారు.



మహోత్సవాన్ని తిలకిస్తున్న గవర్నర్, తుమ్మల తదితరులు


మ్యూజియం ఏర్పాటు పట్ల అధికారులు పీవో రాహుల్, ఇతర అధికారులను అభినందించారు. గిరిజనుల ఇల్లు, సంప్రదాయ వంటకాలను ఆసక్తికరంగా పరిశీలించారు. మళ్లీ భద్రాచలం వచ్చినప్పుడు వంటకాలు రుచి చూస్తానని హామీ ఇచ్చారు. మ్యూజియం ప్రారంభ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య పాల్గొన్నారు. అనంతరం గవర్నర్ 2.40కి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జిల్లా పర్యటనను పురస్కరించుకొని జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.



కొమ్ము కిరీటాలతో ...

వశిష్ఠ స్థానంలో 'పొడిచేటి'

» రామచంద్రాచార్యులుకు దక్కిన గౌరవం



భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శ్రీరామ మహాపట్టాభిషేకంలో వశిష్ఠ స్థానంను విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి రామచంద్రాచార్యులును నియమించారు. ఆనాడు శ్రీరామచంద్రుడు పట్టాభిషేకం సమయంలో ఏ రీతిన ఎనిమిది కీలక స్థానాలు వశిష్ఠుని స్థానంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పట్టాభిషేకం నిర్వహించారో అదే రీతిలో సోమవారం జరిగిన శ్రీరామ మహాపట్టాభిషేకంలోనూ దేవస్థానం వైదిక సిబ్బంది ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ క్రమంలో వశిష్ఠస్థానంలో పొడిచేటి రామచంద్రాచార్యులు, వామదేవ స్థానంలో మరో విశ్రాంత ప్రధాన అర్చకుడు గొట్టిపుల్ల చిన సీతారామాచార్యులు, జాబాలి స్థానంలో విశ్రాంత ఉప ప్రధాన అర్చకుడు పొడిచేటి సత్యనారాయణాచార్యులు, కాశ్యప స్థానంలో అమరవాది వెంకట సీతారామానుజాచార్యులు, కాత్యాయని స్థానంలో ప్రధాన అర్చకుడు కోటి రామస్వరూప్ రాఘవాచార్య వ్యవహరించారు. సుయజ్ఞ స్థానంలో ఉప ప్రధాన అర్చకుడు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, గౌతమ స్థానంలో ఉప ప్రధాన అర్చకుడు కోటి శ్రీమాన్నరాయణాచార్యులు, విజయ స్థానంలో ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్, రఘునాధభట్టాచార్యుల స్థానంలో స్థానాచార్యుడు కేఈ స్థలశాయి భరద్వాజ స్థానంలో అధర్వ వేద పండితుడు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు వాల్మీకి స్థానంలో రామాయణ పారాయణదారుడు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వ్యవహరించారు.

టికెట్లు మిగిలాయి

» నవమికి స్వల్పంగా.. పట్టాభిషేకానికి 50 శాతంపైనే!
» పూర్తిగా అమ్ముడైన ఉభయదాతల టికెట్లు

భద్రాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన శ్రీరామనవమి, శ్రీరామ మహాపట్టాభిషేకంలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు దేవస్థానం ముద్రించిన టికెట్లలో ఇంకా కొన్ని టికెట్లు మిగిలి ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆదివారం నిర్వహించిన శ్రీరామనవమికి స్వల్పంగా టికెట్లు మిగలగా సోమవారం నిర్వహించిన శ్రీరామ మహాపట్టాభిషేకానికి 50 శాతంపైనే టికెట్లు మిగిలాయని తెలుస్తోంది. స్టేడియంలోని 24 సెక్టార్లలో 31,860 మంది వీక్షించేందుకు అవకాశం ఉంది. ఇందులో 15 వేల మంది ఉచితంగా తిలకించేందుకు వెసులుబాటు ఉంది. కాగా 15,860 టికెట్లు విక్రయానికి దేవస్థానం ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ అందుబాటులో ఉంచింది. కాగా నవమికి ఉభయదాతల కోసం విక్రయించిన రూ.7,500 టికెట్లు దాదాపుగా అమ్ముడైనట్లు దేవస్థానం వర్గాల ద్వారా తెలుస్తోంది. దేవస్థానం వద్ద ఉన్న ఉభయదాతల టికెట్లు అన్ని విక్రయించబడగా భద్రాచలం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో విక్రయించిన 150 టికెట్లలో ఎన్ని మిగిలాయి అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. నవమి, కల్యాణ టికెట్లలో కేవలం రూ.300, రూ.150 విలువ గల టికెట్లలో కొన్ని మిగిలినట్లు దేవస్థానం వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇదిలా ఉండగా వీవీఐపీ సెక్టార్ పరిధి పెంచేందుకు ఉభయదాతల పరిధి పెంచేందుకు ఉభయదాతల సెక్టారు పరిధిని తగ్గించిన క్రమంలో 225 టికెట్లు కుదించారు. ఆ 225 టికెట్ల ద్వారా సుమారు రూ.16.50 లక్షల ఆదాయం దేవస్థానం పరోక్షంగా కోల్పోయింది. కాగా సోమవారం నిర్వహించిన శ్రీరామ మహాపట్టాభిసేకంలో రూ.1500, రూ.500, రూ.100 విలువ గల టికెట్లలో 50 శాతంపైనే మిగిలినట్లు సమాచారం. కాగా సోమవారం పట్టాభిషేకం నిర్వహిస్తున్న సమయంలో రెండు గంటల తరువాత భక్తులందరిని అర్జిత టికెట్ల సెక్టార్లలోకి సైతం అధికారులు ఉచితంగా ప్రవేశించేందుకు అనుమతించారు. నవమి, పట్టాభిషేకం ఆదాయంపై మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.



పట్టాభిషేకాన్ని వీక్షిస్తున్న భక్తులు



రామకోటి రాస్తున్న భక్తులు



దేవస్థానం ఈవో రమాదేవి దంపతులు



పట్టాభిరాముడి ఊరేగింపు



ప్రసాద వితరణ చేస్తున్న కంచర్ల గోపన్న సేవాసమితి సభ్యులు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వ్యసనాలకు దూరంగా ఉండాలి: కలెక్టర్

వైరా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చునని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. విద్యార్థులు ఎప్పుడు కూడా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. వైరాలోని ప్రభుత్వ హైస్కూల్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పాఠశాల ఆవరణంలో ఈ చెత్త ఏమిటని ప్రశ్నించి ఆవరణాన్ని శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావు, గిర్దావర్‌లు శ్రీకాంత్, విక్రమ్ పాల్గొన్నారు.

మెనూ విస్మరించడంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం



ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న అదనపు కలెక్టర్

వైరా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో మెనూను అమలుచేయకపోవడం పట్ల జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అదనపు కలెక్టర్ శ్రీజ ఈ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ పాఠశాలలో అమలుచేయాల్సిన మెనూ గురించి ప్రిన్సిపల్ రమను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆదివారం విద్యార్థులకు మటన్‌ఎందుకు పెట్టలేదని ప్రిన్సిపాల్‌ను అదనపు కలెక్టర్ ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే మీరు ఎలా నిర్ణయాలు తీసుకుంటారని నిలదీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మటన్, చికెన్, కోడిగ్రుడ్లు పెట్టాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెనూ అమలు చేయకపోవడంపై తమకు నివేదిక పంపించాలని ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లును ఆమె ఆదేశించారు.

ప్రతీ శుక్రవారం ప్రజావాణి

దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష

- పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి
- గ్రీవెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): 'ప్రజావాణి ఫిర్యాదులకు సర్కారు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలకు జవాబుదారీ తనంగా ఇక నుంచి ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రతి శుక్రవారం సమీక్ష నిర్వహిస్తాం....!' అని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గ్రీవెన్స్‌లో ప్రజలు అందించిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజలను ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనుంచి ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం మన బాధ్యత అని అన్నారు. దీనిపై అన్ని శాఖల వారీగా సమీక్షించనున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమకు అందిన ఫిర్యాదులపై సమీక్షించుకుని సమావేశానికి రావాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్, అదనపు కలెక్టర్ కార్యాలయాల నుంచి వచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల గురించి నివేదిక అందించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వివిధ శాఖలకు 300పైగా దరఖాస్తులు పంపితే 151 మాత్రమే స్పందన వచ్చిందని, ముఖ్య ప్రణాళిక అధికారి, గ్రామీణ అభివృద్ధి అధికారి, మునిసిపల్ కమిషనర్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల వద్ద అధికంగా పెండింగ్ ఉన్నాయని, వీటిని త్వరగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తులు పెండింగ్ ఉండటానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో ఎన్.సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు జ్యోతి, సత్యనారాయణ, డాక్టర్ కళావతిభాయి పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

- తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన చీకటి శ్రీను తమ భూమి, బావి, సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్ కెనాల్ కింద పోయిందని, బావికి సంబంధించిన పరిహారం సొమ్ము జమ కాలేదని, వీటిని ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.
- చింతకాని మండలం కొదుమూరు గ్రామానికి చెందిన తాళ్లూరి వెంగళరావు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 112/ఏలో 5ఎకరాలలో మూడు ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు పోయిందని, మిగిలిన తమ భూములకు అవసరమైన సర్వీస్ రోడ్డును నిర్మించాలని కోరాడు.
- ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ బడేసాహెబ్ తాను దివ్యాంగుడినని, తనకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు.
- ఖమ్మం రాధాకృష్ణనగర్‌కు చెందిన జాస్తి చంద్రశేఖర్ డ్రైనేజ్ కాలుష్య నీరుతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, డ్రైనేజ్ కెనాల్ సరి చేయాలని కోరాడు.



అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో, గాంధీచౌక్ సీతారామ చంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీరామచంద్రమూర్తికి సతీ సమేతంగా పట్టాభిషేకం నిర్వహించారు. ఏటా స్వామి వారి కల్యాణం తరువాత రోజు పట్టాభిషేకం నిర్వహించటం అనవాయితీగా వస్తోంది.. దీనిలో భాగంగా ఇందిరానగర్ పర్ణశాల రామాలయం, గాంధీచౌక్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాల్లో పట్టాభిషేక మహోత్సవాలు ఆలయ అర్చకులు నారాయణం. కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శోభాయమానంగా నిర్వహించారు. గాంధీచౌక్‌లో పట్టాభిషేకం అనంతరం కనకాభిషేకం నిర్వహించారు. పర్ణశాల రామాలయంలో పట్టాభిషేకం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వనం. వేంకటనరసింహారావు, భక్తమండలి ఛైర్మన్ చావా. నారాయణరావు, స్థానిక కార్పొరేటర్ చావా. మాధురినారాయణరావు, సభ్యులు కొత్త. రవి, ఎర్ర. భసవయ్య, కె. పుల్లయ్య, వి. కోమలి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీచౌక్‌లో కల్యాణ రామయ్యకు పట్టాభిషేకం

51వ డివిజన్‌లో శ్రీరామ పట్టాభిషేకం

ఖమ్మంసంక్షేమవిభాగం: ఖమ్మం నగరంలోని 51వ డివిజన్‌లో సోమవారం అంజనేయస్వామి ఆలయంలో శ్రీరామపట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ పునుకొల్లు నీరజ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్పొరేటర్లు శీలంశెట్టి రమా, రాపర్తిశరత్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ఏదులాపురం మునిసిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మంరూరల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వెంకటగిరిలోని ఎస్సీ, బీసీ, జంగాల కాలనీలో తాగునీటి ఇబ్బందులను త్వరలోనే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ హరినాధబాబు హామీ ఇచ్చారు. వెంకటగిరి గ్రామంలోని తాగునీటి ఇబ్బందులు కలిగే కాలనీలను సోమవారం వారు పరిశీలించారు. కాలనీవాసులు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. వీలైనంత త్వరలోనే తాగునీటి ఇబ్బందులకు పరిష్కారం చూపుతామని ప్రజలకు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరికాలనీ ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించాలి

- గ్రామాల్లో రీడింగ్ రూమ్స్‌కు ప్రణాళిక తయారు చేయాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): 8వ తరగతి నుంచి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి లైబ్రరీ, రీడింగ్ రూమ్స్, మాపాప- మాఇంటి మణిదీపం, సన్న బియ్యం తదితర పథకాల అమలుతీరుపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదివే పిల్లలకు కెరీర్ గైడెన్స్ అందించేందుకు ప్రతీ మూడు నెలలకు ఒక సారి మండల కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. 8వ తరగతి నుంచి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రారంభించాలన్నారు.గ్రామాలలో రీడింగ్ రూమ్స్ ఏర్పాటు, వాటి నిర్వహణకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు.పంచాయతీశాఖ పరిధిలో పారిశుధ్య కార్మికులందరికీ ప్రమాదబీమా చేయించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ స్టాఫ్‌కు బీమా కల్పించాలన్నారు. మాపాప- మా ఇంటి మణిదీపం కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఆడపిల్లలకు పోస్టాఫీసు సుకన్య సమృద్ధి యోజన క్రింద ఖాతా ఓపెన్ చేయించాలని అన్నారు. సన్న బియ్యం లబ్ధిదారులు కూడా ఆడపిల్ల పుట్టిన కుటుంబంలో ఉంటే అధికారులు వారితో భోజనం చేసి రావాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో ఎన్.సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

లంకాసాగర్ ప్రాజెక్టును పరిశీలన

పెనుబల్లి: మధ్యతరహా ప్రాజెక్టు అయిన లంకాసాగర్ ప్రాజెక్టును సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. రైతులతో మాట్లాడుతూ ప్రాజెక్టులో నీటినిల్వ పెరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్చించారు. రైతుల భూసమస్యల గురించి కలెక్టర్‌కు తెలపగా ఈనెల 21నాటికి పరిష్కరించటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. లంకాసాగర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్యశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి లంకాసాగర్ పీహెచ్‌సీకి 102వాహనాన్ని వారం రోజుల్లో కేటాయించాలని ఆదేశించారు.

పారిశుధ్య పనుల తనిఖీ

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను పకడ్బందిగా చేపట్టాలని, సరైన డ్రెయినేజీ విధానం లేని ప్రాంతాలను తన దృష్టికి తీసుకరావాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం 14వ డివిజన్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. సైడ్ కాల్వలు, పారిశుధ్య పనులను తనిఖీలు చేశారు. కాలవల నిర్మాణంలో ఎక్కడ లోపాలు లేకుండా నీరు నిల్వకుండా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్ పారిశుధ్య అంచనాలను వేసి నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు.



ఎప్‌సెట్ శిక్షణను పరిశీలించిన శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల సైన్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎప్‌సెట్ శిక్షణ తరగతుల సెంటర్‌ను సోమవారం అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) పి.శ్రీజ సందర్శించారు. నగరంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు, బాలికలు కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, కళాశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

'పదోతరగతి' మూల్యాంకనం ప్రారంభం

- మొదటిరోజు ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులు
- తొలిరోజు 10,200 జవాబు పత్రాల మూల్యాంకనం

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెంయిట్ జోసెఫ్ పాఠశాలలో సోమవారం పదో తరగతి మూల్యాంకనం ప్రారంభమైంది. ఉదయం 9:30కు చేరుకోవాల్సిన ఉపాధ్యాయులు మొదటిరోజు కావటంతో ఆలస్యంగా ఉదయం 10:30 తరువాత వచ్చారు. దీంతో మూల్యాంకనం మధ్యాహ్నం రెండు గంటల తరువాత ప్రారంభమైంది. వాస్తవానికి రోజుకు ఒక్కో ఉపాధ్యాయుడు 40 పేపర్ల మూల్యాంకనం చేయాల్సి ఉండగా మొదటిరోజు 20 పేపర్ల మూల్యాంకనం చేశారు. మొత్తం 560 మంది రిపోర్టు చేసి 10,200 పేపర్ల మూల్యాంకనం పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం విధులకు హాజరుకాని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు. హాజరైన కొందిమందిలో ఎక్కువగా అనారోగ్య సమస్యలు ఉన్నాయని సుమారు 200 మందికిపైగా మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రాలు అందించినట్లు తెలిసింది. మూల్యాంకనం క్యాంప్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, డిప్యూటీ క్యాంపు అధికారిగా శ్రీనివాస్, వ్యవహరించగా, రిపోర్టింగ్ ప్రక్రియను ఎంఈఓలు శైలజాలక్ష్మీ, వీరస్వామి, శ్రీనివాస్ నిర్వహించారు.



మూల్యాంకన కేంద్రం వద్ద ఉపాధ్యాయులు

గడ్డి మిషన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఖమ్మంరూరల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి):గడ్డి కట్టే ట్రాక్టర్ మిషన్‌లో చేయిపడి డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం,మంగళగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగూడెం పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన దేశబోయిన వీరన్న గడ్డికట్టే ట్రాక్టర్ మిషన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈక్రమంలో తనగంపాడు గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో గడ్డి కట్టేందుకు వెళ్లాడు. అక్కడ గడ్డి కట్టే మిషన్‌లో ఏదో అడ్డుపడినట్లు అనిపించింది. మిషన్ ఆన్‌లోనే ఉండగానే తొలగించే ప్రయత్నం చేయగా, విషన్‌లో కుడి చేయి పడింది. సుమారు రెండు గంటలపాటు తీవ్ర ఇబ్బందులు పడిన వీరన్నను స్థానిక రైతులు మిషన్ ఆపి బయటకు తీశారు. ఖమ్మంలో ఆసుపత్రికి తరలించగా కుడి చేయిపూర్తిగా నలిగిపోయి తీవ్రంగా దెబ్బతిన్నది. వీరన్న పరిస్థితి నిలకడగా ఉంది.

ప్రభుత్వ ఆస్పత్రిలో నేడు సదరం శిబిరం

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సర్కారు ఇవ్వదలిచిన యూడీఐడీ కార్డుల మంజూరికి మంగళవారం సదరం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ తెలిపారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల పంపిణీ కోసం ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులు సకాలంలో హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన సదస్సు

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలపై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫౌండర్, డైరెక్టర్ వి. అభిరామ్ తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హాజరవుతారని, ఈ సదస్సులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, వాటి ప్రాముఖ్యతపై యువతకు వివరించనున్నారు.

శ్రీకాంత్ మృతికి సీపీఎం నాయకుల సంతాపం

నేలకొండపల్లి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి):సీపీఎం సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్ మరణం సీపీఎంకు తీరని లోటని మండల సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎర్రా శ్రీకాంత్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జిల్లా నాయకుడు గొడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమిళనాడులోని మధురైలో జరుగుతున్న పార్టీ 24వ జాతీయ మహాసభలకు ప్రతినిధిగా ఎన్నికైన శ్రీకాంత్, మధురైలో మహాసభల్లో ఉండగానే గుండెపోటుతో మృతి చెందటంబాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏటుకూరి రామారావు, యలమద్ది లెనిన్, మార్తి కొండలు, మంకెనపల్లి నర్సింహారావు, యడ్ల తిరుపారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, శేషుబాబు, చారి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఖమ్మంచర్చికాంపౌండ్: యర్రాశ్రీకాంత్ మృతి పట్ల బీఆర్ అంబేద్కర్ ప్రజాసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు.



శ్రీకాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండల సీపీఎం నాయకులు

సుప్రీంకోర్టులో మంచుకొండ హత్యాయత్నం కేసు కొట్టివేత

ఖమ్మంలీగల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ గ్రామానికి చెందిన మండడపు సుధాకర్, మండడపు మాధవరావు,ఎల్లంపల్లి హనుమంతరావులపై నమోదుచేసిన హత్యాయత్నం కేసును సుప్రీం కోర్టు.. హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. నేరపూరితకుట్ర, ఆయుధచట్టం అభియోగంపై గత ఏడాది మే2న తెలంగాణ హైకోర్టు కొట్టివేయటాన్ని సుప్రీంకోర్టు సోమవారం సమర్థించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ రాజేష్ బిందాల్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. భూమి సరిహద్దు తగాదాల విషయంలో తనను హత్య చేసేందుకు నిందితులు రౌడీషీటర్లు భైరు వెంకన్న, దొడ్డా హరీష్, ధర్మవరపు సర్వేశ్‌లకు నగదు ఇచ్చి రెండు పెద్ద కొడవళ్లు సరఫరా చేశారని 2021లో స్థిరాస్తి వ్యాపారి తుళ్లూరు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ఖమ్మం ఖానాపురంహవేలి పోలీసులు నిందితులపైన పేర్కొన్న అభియోగాల కింద కేసునమోదు చేశారు. దర్యాప్తు అనంతరం 2022న కోర్టులో చార్జిషీటు దాఖలుచేశారు. ఫిర్యాది శ్రీనివాసరావుకు ఎలాంటి గాయాలు కాలేదు. కేసు ఖమ్మం మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్ కోర్టులో విచారణకు వచ్చింది. చార్జిషీట్‌ను సవాల్‌చేస్తూ ముగ్గురు నిందితులు హైకోర్టులో క్రిమినల్ పిటీషన్ దాఖలుచేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ముగ్గురు నిందితులపై అభియోగాలు రద్దుచేస్తూ కేసును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఫిర్యాది శ్రీనివాసరావు సుప్రీంకోర్టులో క్రిమినల్ పిటీషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల సుదీర్ఘవాదనలు విన్న సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును పరిశీలించి ముగ్గురు నిందితులపై హైకోర్టు కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పును ధ్రువపరచింది. నిందితుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు సీహెచ్. వెంకటరమణ, డి.సోమయాజులు వాదించగా, ఖమ్మం కోర్టులోని సీనియర్ న్యాయవాది కిలారు బాజ్జి సహకారం అందించారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ఖమ్మంలీగల్,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ఖమ్మంపట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎస్‌కే.లతీఫ్‌ను ఖమ్మం టూటౌన్ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఖమ్మం బార్ అసోసియేషన్ కార్యవర్గం తీర్మానం మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన ముజ్తాబా న్యాయవాదిపై దాడిని తీవ్రంగా ఖండించారు. తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్, కాంగ్రెస్‌పార్టీ లీగల్ సెల్, ఐలు, ఐఏఎల్, బీజేపీతోపాటు పలువురు న్యాయవాదులు ఖండించారు.

రేపు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

ఖమ్మంమార్కెట్,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీఐటీయూ నేత ఎర్రా శ్రీకాంత్ మృతికి సంతాపంగా ఈనెల9న గురువారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌లోని కార్మిక సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు విన్నపం మేరకు సెలవు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 10న శుక్రవారం నుంచి యధావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవులు విషయాన్ని గ్రహించాలని కోరారు.



మంత్రి ఉత్తమ్‌ను కలిసిన మువ్వా

సత్తుపల్లి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వద్ద ఆయన ఛాంబర్‌లో కలిసి పలు అంశాలపై చర్చించారు. ప్రాజెక్టులు, కాలువలు, రైతులు, సాగునీటి సమస్యలపై మాట్లాడిన అనంతరం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిశీలిస్తానని హామీ ఇచ్చారన్నారు.

'హామీలను అమలు చేయాలి'

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన తప్పులే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆరోపించారు. సమ్మె నోటీస్ ఇచ్చేందుకు జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు హైదరాబాద్ వెళ్లనున్న నేపథ్యంలో సత్తుపల్లి డిపోలోని కార్మిక సంఘ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో యనమాల నాగరాజు, మల్లిఖార్జునరావు, బాలస్వామి, కృష్ణారెడ్డి, సతీష్, జీ.కృష్ణ, వసంతరావు, ఎన్ఆర్.కృష్ణ తదితరులు ఉన్నారు.

గాలిదుమారం.. అకాల వర్షం

» ఓసీలలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి » నేలవాలిన వరి

సత్తుపల్లిరూరల్/వేంసూరు/బోనకల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): పలు మండలాల్లో సోమవారం సాయంత్రం కురిసిన వర్షం, గాలిదుమారం కారణంగా రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న రైతులు పరుగులు పెట్టారు. వర్షానికి తడవకుండా పరదాలు కప్పే క్రమంలో నానా అగచాట్లు ఎదుర్కొన్నారు. అరటి మొక్కలు గాలిదుమారానికి నేలకొరగగా మామిడి నేలరాలిందని రైతులు వాపోయారు. కాగా సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీలో 5.0ఎంఎం, గంగారంలో 10.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఓసీలలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడగా భారీ మోటార్ల సాయంతో నీటిని తోడుతున్నట్లు అధికారులు చెప్పారు.



ధాన్యంపై కప్పిన పట్టాలపై నిలిచిన వర్షపు నీరు



బోనకల్‌లో పట్టాలు కప్పుతున్న రైతులు



వేంసూరులో నేలకొరిగిన వరిపైర్లు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెనుబల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సాగుచేస్తున్న పంటలను కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం మధ్యతరహా ప్రాజెక్టు అయిన లంకాసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రాజెక్టులో నీటినిల్వ పెరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. రైతులు తమకు సంబంధించి పలు భూసమస్యల గురించి కలెక్టర్‌కు తెలపగా ఈనెల 21నాటికి తహసీల్దార్ గంటా ప్రతాప్, కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ ఆధ్వర్యంలో పరిష్కరించటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

లంకాసాగర్ పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లంకాసాగర్ ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్తూ మార్గమధ్యలో ఉన్న పీహెచ్‌సీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి చింతా కిరణ్‌కుమార్‌తో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 102వాహనాన్ని ఏర్పాటుచేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా వైద్యశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి లంకాసాగర్ పీహెచ్‌సీకి 102 వాహనాన్ని వారంరోజుల్లో కేటాయించాలని ఆదేశించారు. ఎంపీడీవో అన్నపూర్ణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వైరాలో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

» ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ



ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

వైరా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో రబీలో సాగుచేసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 23 కేంద్రాలను ఏర్పాటుచేశామని వ్యవసాయశాఖ వైరా డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీఏ) తుమ్మలపల్లి కరుణశ్రీ తెలిపారు. మండలంలోని గరికపాడు సొసైటీ పరిధిలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏడీఏ కరుణశ్రీ సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో మయాన్ మంజూఖాన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అయిలూరి కృష్ణారెడ్డి, ఏఈవో సైదులు, బొళ్ల గంగారావు, గుగులోతు రాము, పమ్మి అశోక్, నాగిరెడ్డి, గూడూరు కృష్ణారెడ్డి, ముక్కర వెంకటకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, సామల శివారెడ్డి, వేమిరెడ్డి బాలకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్తును చదువుతో చక్కగా తీర్చిదిద్దుకోవాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం. నీరుడు నాగేశ్వరరావు అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ పద్మ, కాంప్లెక్స్ హెచ్ఎం పూరేటి యాకోబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూసీఐ సభలను జయప్రదం చేయండి

తల్లాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఈనెల 13న జరిగే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు కోరారు. సోమవారం తల్లాడలో మహాసభల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్.లాల్‌మియా, తల్లాడ ఏరియా నాయకులు శ్రీను, నరేష్, రవి, రామారావు, రామకృష్ణ, రాఘవ, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, శివ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

తల్లాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లాడ సొసైటీ పరిధిలోని గ్రామాల్లో దాల్వా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు అవసరమైన గన్నీసంచులు అందజేయాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆపతి వెంకటరామారావు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోపరేటివ్ సెల్ కన్వీనర్ తేజావత్ బాలాజీనాయక్, బీజేపీ నాయకులు గాదె కృష్ణారావు, చల్లా నరేష్, వెల్లంకి సుధాకర్, రైతులు నున్నా రామారావు, పిన్ని హన్మంతరావు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలపై అవగాహన

బోనకల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మోడల్ ఇంటి నిర్మాణాలపై తహసీల్దార్ పున్నం చందర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ 75 రోజుల వ్యవధిలో ఇంటి నిర్మాణాన్ని దశల వారీగా చేపట్టే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి

బోనకల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో ఉద్యమకారులు, జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సోమవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ పున్నం చందర్‌కు టీయూడబ్ల్యూజే జాతీయ సమితి సభ్యుడు తమ్మారపు వెంకటేశ్వర్లు, యంగల ఆనందరావులు వినతిపత్రాన్ని అందజేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన జర్నలిస్టుల స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజేయూ నాయకుడు ఆకేన పవన్, ఏలూరి పూర్ణచందర్‌రావు, గుంపుల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

తల్లాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్ డాక్టర్ శిరీష, నేత్ర వైద్యనిపుణుడు డాక్టర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యావతి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు కోటేశ్వరి, మీనా పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థికి గాయాలు

పెనుబల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న చౌడవరం గ్రామానికి చెందిన కడియం వంశీ అనే విద్యార్థి సోమవారం మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా, కొత్తగూడెం రోడ్డులో మసీదు వద్ద రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీకి తీవ్రగాయాలు కావడంతో పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం నుంచి హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు వీఎంబంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోరాట యోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

» సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి

బోనకల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడిగా గుడిదె కృష్ణను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకుడు తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, నాయకులు వంగాల నరసింహారావు, మడుపల్లి వెంకటేశ్వర్లు, ఏలూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మన అలవాట్లే మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష: ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మన అలవాట్లే మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లిలో 2కే రన్ పాత సెంటర్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, సిబ్బంది, లయన్స్ క్లబ్ బాధ్యులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో నిర్వహించిన 2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



తల్లాడలో...

తల్లాడలో..

తల్లాడ: నవజాతి శిశువుల ఆరోగ్యం మెరుగుపర్చడంపై దృష్టిసారించడం వల్ల శిశుమరణాలను అరికట్టవచ్చునని వైద్యాధికారి ఐ.రత్నమనోహర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం తల్లాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్, సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్లు పెద్దపుల్ల య్య, భద్రమ్మ, స్టాఫ్ నర్సు కళావతి, సునీత, కృష్ణ, ప్ర భాకర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం విలువలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి కదుర్ల అన్నారు. అయ్యగారిపేట-5లోని అంగన్‌వాడీ సెంటర్‌లో స్రవంతి అనే గర్భిణీకి సీమంతం చేశారు. అదేవిధంగా ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్ అవ్వమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహాలక్ష్మి, టీచర్లు రమాదేవి, భారతి, రాధ, రజిని, పోషణ అభియాన్ ఇంచార్జీ బీసీ.ప్రసాద్, డీఈవో శిరీష పాల్గొన్నారు.

మాదారంలో తీరనున్న విద్యుత్ సమస్య..

కారేపల్లి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదారం గ్రామస్థులు లోఓల్టేజీ సమస్య పరిష్కారాన్ని సమష్టిగా పరిష్కరించుకున్నారు. మాదారం గ్రామ మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ ఆధ్వర్యంలో గ్రామ అఖిలపక్ష కమిటీ నాయకులు ఇటీవల విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను వినతి పత్రం అందించారు. వారి ఆదేశాల మేరకు గ్రామస్థులు కలెక్టర్‌ను కలిశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ గ్రామంలో సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తూ, సంస్థ అధికారులతో మాట్లాడి నిర్మాణం కోసం రూ.3కోట్ల నిధులు కూడా మంజూరు చేశారు. త్వరలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అధికారుల చేతుల మీదుగా సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు నరేష్ సోమవారం తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

తల్లాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పగుళ్లు వచ్చి పెచ్చులూడటంతో నివాసముంటున్న కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. 2021వ సంవత్సరంలో కేశ్వాపురం గ్రామంలో 20డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి పేదలకు పంపిణీ చేశారు. కాగా ఆదివారం పైళ్ల మాధవి అనే మహిళ నివాసముంటున్న డబుల్‌బెడ్‌రూం ఇల్లు మెట్లు కూలిపోయాయి. డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నాణ్యతాలోపంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో బాధితులు ఫిర్యాదు చేశారు.

ప్రజల భాగస్వామ్యంతో సామాజిక సేవ

కల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో రోటరీ క్లబ్ అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతుందని రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ దాత కాటంనేని రవీంద్ర, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, బీజీఆర్ మైనింగ్ ఇన్ఫ్రా తరుపున రూ.3.50 లక్షలు వితరణ చేశారు. సోమవారం పాఠశాల వంటగదిని న్యాయవాది కాటంనేని రమేష్, రాంప్రసాద్, కోటిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ సాంబశివుడు, ఎస్ఐ హరిత, ఎంపీడీవో చంద్రశేఖర్, వల్లపునేని రవి, కాటంనేని బాబురావు, భద్రయ్య, కాటంనేని వెంకటేశ్వరావు, జక్కంపూడి కిషోర్, కాటంనేని రామారావు తదితరులున్నారు.



పాఠశాలలో వంటగదిని ప్రారంభిస్తున్న దాతలు రాంప్రసాద్, బాలకోటిరెడ్డి

దరఖాస్తుల స్వీకరణ

కారేపల్లి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవిం ద్రప్రసాద్, డీడీ కృష్ణయ్య ఉన్నారు.

సన్నబియ్యం పరిశీలన

కారేపల్లి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని సోమవారం మాజీ వైస్ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రావూరి శ్రీనివాస్‌రావు పరిశీలించారు. మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో పేదలకోసం మంజూరైన బియ్యాన్ని ఆయన గ్రామంలోని కొందరు పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం చాలా బాగున్నాయన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ముదిగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ సూచించారు. మండలంలోని మేడేపల్లి, కట్టకూరు గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఛైర్మన్ వెంకటేశ్వరరావుతో కలిసి తహసీల్దార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామినేని రమేష్, సీఈవో శ్రీనివాసరావు, ఏఈవో మౌనిక, ఆర్ఐ వహీదాబేగం పాల్గొన్నారు.

సీఆర్పీలకు శిక్షణ

కల్లూరు, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం సీఆర్పీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2025 ఏప్రిల్ నుంచి స్వయం సహాయక సంఘాలలో లావాదేవీలు, పుస్తకాల నిర్వహణలపై తనిఖీలు నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నేటి నుంచి ఐదు రోజుల పాటుగా నిర్వహించనున్నారు. మాస్టర్ ట్రైనర్స్ ప్రశాంత్‌రెడ్డి, జనార్ధన్‌లు శిక్షణ ఇస్తున్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

ముదిగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో నూతనంగా నిర్మించనున్న 50పడకల ఆసుపత్రికి సంబంధించి స్థలాన్ని సోమవారం తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, సర్వేయర్ ఉమామహేష్, ఏఈ జమలయ్య పరిశీలించారు. ఆసుపత్రికి సరిపడా స్థలాన్ని పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ప్రతిభ చాటేలా చదవాలి: ఏఎంవో

బోనకల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుల్లో ప్రతిభ చాటేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎంవో రవి కుమార్ సూచించారు. బోనకల్ కేజీబీవీ, సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ఎంజేపీ గురుకులాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంఈవో దామాల పుల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేజర్లలో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామచంద్ర ప్రభువుకి పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త, ఉపన్యాసరత్న శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణఆచార్య స్వామిచే వేడుకను జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫాం క్లాత్ పంపిణీ

బోనకల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో సోమవారం యూనిఫాం క్లాత్‌ను తహసీల్దార్ పున్నం చందర్, ఎంఈవో దామాల పుల్లయ్య, ఏపీఎం సురేందర్‌లు స్టిచ్చింగ్ ఏజేన్సీలకు అందజేశారు. పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫాంల స్టిచ్చింగ్ పూర్తి చేసి వారికి అందజేయాలని ఆదేశించారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్టు

వైరా, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఛలో హైదరాబాద్ గిరిజన సంక్షేమ భవన్ ముట్టడిని పురస్కరించుకొని ముందస్తుగా సోమవారం సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం సహా పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

కొణిజర్ల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గిరిజనసంఘాల ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ భవనం ముట్టడి ఉన్నందున ముందస్తుగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శిని గృహనిర్బంధం చేయడం సరికాదని ఖమ్మం జిల్లా రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు.

పల్లె దవాఖానాకు శంకుస్థాపన

» భవనాన్ని నిర్మించేందుకు ముందుకువచ్చిన దాత సుభాష్



పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేస్తున్న దాత పుతుంబాక సుభాష్

మధిర రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పుట్టిన జన్మస్థలంపై మమకారంతో తన స్వగ్రామంలో ప్రభుత్వ పల్లె దవాఖానాను నిర్మించేందుకు స్థలాన్ని ఇవ్వడంతోపాటు భవన నిర్మాణానికి అయ్యే ఖర్చంతా తానే భరిస్తూ మండలంలోని మహదేవపురం గ్రామంలో ఓ దాత తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. ఆ భవన నిర్మాణ పనులకు కూడా సోమవారం శంకుస్థాపన చేశారు. మధిర మండలం మహదేవపురం గ్రామానికి చెందిన పుతుంబాక సుభాష్ ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తన తల్లి పుతుంబాక రామసీతమ్మ పేరుతో ఈ పల్లె దవాఖానా భవనం నిర్మించేలా ముందుకు సాగుతున్నారు. తండ్రి పుతుంబాక పురుషోత్తం, తల్లి రామసీతమ్మ పేరుమీద స్థలదాతలుగా వితరణ ఇచ్చాడు. సోమవారం గ్రామపెద్దల సమక్షంలో దాత పుతుంబాక సుభాష్ పల్లెదవాఖానా పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో స్థలం ఇచ్చి ఆసుపత్రి భవన నిర్మాణానికి ముందుకొచ్చిన సుభాష్‌ను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పృథ్వీరాజ్‌నాయక్, దాత పుతుంబాక సుభాష్, పర్వాత వర్ధిని దంపతులు, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, వాసిరెడ్డి శివలింగప్రసాద్, డాక్టర్ చావా భాస్కర్‌రావు, పుతుంబాక హన్మంతరావు పాల్గొన్నారు.